
# థేంక్యూ టూ సోమలింగం

డి. కామేశ్వరి



"ఇందాక రావు ఫోను చేశాడు. మిమ్మల్ని హోటల్ సాగర్ రూమ్ నెంబరు 12 కి రమ్మన్నాడు...." అంది శ్రీమతి రాగానే,

"రావా?....హోటల్ సాగర్‌కా?.... ఎందుకు?"

"ఏమో, నాకేం తెలియదు. నేను అడిగా-'ఏమంది రాగానే ఓ సారి రమ్మనండి' అన్నాడు"....కాఫీ తెచ్చి యిచ్చి అంది పద్మ.

బట్టలు మార్చుకునే ప్రయత్నం చేయకుండా వచ్చినవాడిని మళ్ళీ యలుదేరాను.

హోటల్ సాగర్....రావు రమ్మనడం ....ఏమిటో అర్థం కాలేదు. ఎవరన్నా కామన్ ఫ్రెండు వచ్చి దిగాడేమో.... చూడ్డానికి రమ్మన్నాడేమో....

సరే....తినబోతూ రుచులెందుకు?

సాగర్ రూము నెంబర్ 12 ముందు నిలబడి కాలింగ్‌బెల్ నొక్కాను. రావు తలుపు తెరిచాడు. నిద్రపోతున్నట్లున్నాడు. క్రాపింగ్ చెదిరివుంది. మొహం భారంగా వుంది.

"రా, లోపలికి...." అన్నాడు మొహంమీదకి నవ్వు తెప్పించుకోడానికి ప్రయత్నిస్తూ.

లోపలికి వెళ్ళిచూస్తే కాస్త ఆశ్చర్యం వేసింది. సింగిల్ రూము. బెడ్‌మీద అప్పుడే పడుకుని లేచిన గుర్తులు.... బట్టలస్టేండు మీద నాకు బాగా పరిచితమైన రావు పేంట్లు, బుష్ షర్టులు, టూట్లు వున్నాయి, డ్రెస్సింగ్ టేబిల్ మీద షేవింగ్‌సెట్టు. టాయిలెట్ సామాను, రావు కాల్చే బ్రాండ్ సిగరేట్లు ఆ ప్రక్కన టేబిల్‌మీద రావు ఆఫీసు డయిరి బ్రీఫ్ కేసు వగైరా ఉన్నాయి, మరో ప్రక్క ఓ సూటుకేసు వుంది.

ఆ రూములో వున్నది రావేనని స్పష్ట పరిచాయి ఆ సామానులన్నీ కలిపి. రావు ఇల్లువదిలి హోటల్లో మకాం ఎందుకు పెట్టాల్సివచ్చిందో ఏం అర్థంకాలేదు.

అంటే? ఎవరిని చూడడంకోసం? ఏ ఫ్రెండుని కలుసుకోడంకోసం నన్ను

పిలవలేదని ఎవరూ చెప్ప నక్కరలేకుం డానే స్పష్టపడింది.

చుట్టూచూసి రావువంక చూశాను. నా వంశయాత్మక చూపులని గ్రహింపుతూ ....'పిల్ డౌన్' అన్నాడు కుర్చీ చూపించి.

"ఏమిటి....యిక్కడి కెందుకు రమ్మన్నావట....?"

"నీతో మాట్లాడాలని...." రావు సిగరెట్టు తీసుకుని నా కోటి ఆఫర్ చేశాడు.

"మాట్లాడడానికి ఇక్కడి కెందుకు? ఇల్లేమయింది?....

"నే నిక్కడ వుంటున్నాను గనుక ఇక్కడికే రమ్మన్నాను.." అన్నాడు రావు సిగరెట్టు వెలిగించుకుంటూ....

నేను తెల్లబోయి చూశాను. .."ఇక్క డుంటున్నావా?.... అంటే ... ?... ఏమి టిది....ఎప్పటినుంచి ఇది....?"

రావు జవాబీయలేదు. సిగరెట్టు వేళ్ళ మధ్య త్రిప్పుతూ నిశితంగా దానివంకే చూస్తూ వూరుకున్నాడు.

"రావ్,....ఏమిటి? ఏం జరిగింది? హోటల్లో వుండడం ఏమిటి ఇల్లేమ యింది? రేఖ ఏమయింది? వురిలోలేదా? ....ఇక్కడ ఎప్పటినించి వుండడం?" అని ఆరాటంగా ప్రశ్నలు కురిపించాను.

"మొన్న పొద్దుటి నించీ ఇక్కడ...." రావు నెమ్మదిగా అతి శాంతంగా జవాబిచ్చాడు.

"మరి రేఖ?"

"వుంది.... ఇంట్లో ...." పట్టి పట్టి అన్నాడు వొక్కొ వలుకుతూ.

మరింత ఆశ్చర్యపోయాను అయో మయంగా చూశాను. రావు హోటల్లో.... రేఖ ఇంట్లో....ఏంజరిగింది?... నస్పెన్సు భరించడం కష్టం అయింది.

"రావ్..సరిగా చెప్పు. నాకేం అర్థం కావడం లేదు....ఇల్లొదిలి ఇక్కడుండడం ఏమిటి?"

రావు కొన్ని క్షణాలు మాట్లాడలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు అతి సీరియస్‌గా అరచేతివంక చూస్తూ కూర్చున్నాడు....

"రావ్!" అన్నా మళ్ళీ.

రావు తలెత్తి నా కళ్ళల్లోకి చూశాడు.



....'మూర్తీ!....నాకు రేఖనించి విడాకులు కావాలి....' ఉపోద్ఘాతం ఏం లేకుండా సూటిగా అన్నాడు.

దిమ్మెరపోయి చూశాను.

"ఏమిటి అలా చూస్తున్నావు? రేఖ నేను విడిపోతాం.... విడాకులు కావాలి దీనికి నీ సాయం కావాలి ప్లీడరుగా....".అన్నాడు.

ప్రేమించి కావాలని పెళ్ళాడి రెండేళ్ళయినా కాకముందే విడాకులు! విడి పోవడం! ఆ షాకు నించి తేరుకోడానికి రెండు నిమిషాలు పట్టింది నాకు.

భార్యా భర్తలకి పడకపోవడం ఎప్పు డొచ్చింది? ఎందుకొచ్చింది? కారణాలు ఏమిటి?....ఆలోచిస్తున్న కొద్దీ ప్రశ్నలు పుట్టుకు రావడం మొదలు పెట్టాయి.

భార్యా భర్తల మామూలు కలహాలనే రావు భూతద్దంలోంచి చూశాడా? మాట-మాట ఏదో అనుకుని యీయనగారు అలిగి, రేఖని బెదిరించడానికి హోటలు కొచ్చి మకాం పెట్టేసి వుంటాడు! విడా కులు అంటూ తమాషా చేస్తున్నట్టున్నాడు తనతో!

"బాగుంది. కానీ - ప్రణయ కలహాలకి కోర్టులో తీర్పు నీయ రోయి...." అన్నాను నవ్వుతూ వాతావరణం తేలిక పర్చడానికి ప్రయత్నిస్తూ.

రావు నవ్వలేదు. మొహం గంభీరంగా పెట్టి "ఇది తమాషా కాదు. నేను సీరి యస్‌గా అంటున్నాను. ఈ సంగతి నీతో స్నేహితుడిగా చెప్పడం లేదు. వకీలుగా పిల్చి చెప్తున్నాను....నాకు విడాకులు కావాలి యిప్పించు" అన్నాడు.

నా మొహం మీది నవ్వు మాయ మయింది. "రావ్!" అన్నా నేనూ సీరి యస్‌గా. "ఇందాకట నించి యిదేదో తమాషా అనుకుంటున్నాను....ఏదో మామూలు ప్రణయ కలహం అనుకు న్నాను. రావ్, ఏం జరిగింది సరిగా చెప్పు. ఇంత దూరం ఎందుకు వచ్చావు నీవు? అసలు కారణం ఏమిటి చెప్పు.... నేను వెళ్ళి రేఖతో మాట్లాడుతాను...." ఆరాటంగా, ఆత్రుతగా అన్నాను.

"ఆవిడతో మాట్లాడాల్సిందేం లేదు. నేను చెప్పేందుకు ఏమీలేదు. మా యిద్దరికి సరిపోదు-సరిపోవడం లేదు. విడిపోవడం మంచిదని నిశ్చయించుకున్నాను.

నాకు వళ్ళు మండుకొచ్చింది. అసలు కారణం ఏమిటని ఎంత అడిగినా చెప్పడు. విడాకులు-విడాకులు అంటూ పాట!.... విడాకులు_అంటే తమలపాకులు వేసు కున్నంత సుఖవు అనుకుంటున్నాడు గాబోలు....

"రావ్, స్నేహితుడుగా అన్ని విష యాలు చెప్పమని నేనడగను....కానీ, ఇఫ్ యూ వాంట్ మీ టు ప్రొసీడ్ విత్ ది కేస్....అన్ని వివరాలు తెలియాలి...." కఠినంగా అన్నాను.రావు నామొహం కేసి చూసి తల దించుకున్నాడు. కొన్ని క్షణాలు మౌనం.... నేను ఆరాటంగా ఎదురుచూస్తు న్నాను.

"చెప్పాలంటావా?"

"చాలా బాగుంది, డాక్టరు దగ్గ రకెళ్ళి రోగం దాస్తే ట్రీట్ చేస్తాడా? అలాగే డైవోర్సు కావా లంటూ ప్లీడరు దగ్గరకెళ్ళి భార్యా భర్తలకి సరిపోక పోవడానికి కార ణాలు చెప్పకపోవడం అంతే! డైవోర్సుకి అప్లై చేయడానికి భార్యా భర్తలకి పడక పోవడానికి, విడిపోవా లనుకోడానికి కార ణాలు అన్నీ సోదాహరణంతో వివరిం చాలి."

రావు ఇబ్బందిగా కదిలాడు. "చెప్ప

దానికి పెద్ద కారణాలుగా కనిపించక పోవచ్చు.... బట్.... మూర్తీ... రేఖకి నేనంటే బొత్తిగా కేర్ లేదు.... మాత్రం గౌరవం లేదు.... నన్నో భర్తగా ట్రీట్ చేస్తూ కేర్ చేయటం లేదు!'' ఒక్కొక్క మాట నెమ్మదిగా నోట్లోంచి బలవంతంగా పెకిలిస్తూ అన్నాడు.

కేర్ చేయక పోవడం భర్తగా ట్రీట్ చేయక పోవడం అంటే ఏమిటి? కేర్ చేయడం లేదని నీకెలా తెలిసింది? నీమీద గౌరవం వగైరాలు లేనట్లు అనిపించడానికి ఏ ఏ సంఘటనలు నీకాధారం?....'' లాయరు పాయింట్లు సూటిగా అడిగాను.

రావు కాస్త తడబడ్డాడు. కాస్సేపు పూరుకుని ''ఇలాటివి మాటల్లో చెప్పడం కుదరదు మూర్తీ.... అనుభవించాను.... అనుభవించిన వాడికి గానీ తెలియదు.... ముందే చెప్పాగా—చెప్పడానికి పెద్ద కారణాలుగా కనిపించక పోవచ్చు! కాని— కానీ—'' మాటల కోసం తడుముకున్నాడు.

రావు బాధ అర్థం అయింది.

''అంటే, రేఖ నీమాట వినడం లేదంటావా? ఏ విషయంలోనూ నీతో సహకరించడం లేదా? నీకీయాల్సిన గౌరవం యీయడం లేదంటావా? రేఖ అలా ప్రవర్తించే రకంలా ఎన్నడూ అవుపడలేదే!''

''నీకెలా అవుపిస్తుంది? ఇంట్లో వుండే మొగుడికి తెలుస్తుంది.'' కసిగా అన్నాడు రావు. ''ఎంత నిర్లక్ష్యం-ఏదన్నా చెపితే, నీవు చెప్పడం - నే వినడం ఏమిటన్న అహంకారం! నేను ఔనన్నది కాదనడం-కాదన్నది ఔననడం, మనసులో ఒకవేళ చెయ్యాలని వున్నా చేస్తే ఎక్కడ లోకువవుతానో అన్నట్టు ప్రవర్తించడం.... ఇవన్నీ పైనించి చూసే వాళ్ళకి ఎలా తెలుస్తాయి?'' ఆవేశంగా మొహం ఎర్రపరుచుకుంటూ అన్నాడు రావు.

వింటున్నాను.

''ఈ అతిశయం-అహంకారం అంతా దేనివల్ల వచ్చిందో నాకు తెల్సు.'' కసిగా అన్నాడు మళ్ళీ.

''దేనివల్ల?'' ఆశ్చర్యంగా అడిగాను.

''డిగ్రీలు చూసుకుని, ఉద్యోగం చూసుకుని, సంపాదన చూసుకుని.... చదువుంది, ఉద్యోగం వుంది, సంపాదన వుంది—మొగుడు కంటె దేన్లో తక్కువ? ఈ మొగాళ్ళ దేన్లో అధికులు మన కంటే?

---

* ఒకావిడ మనస్తత్వ వేత్తతో యిలా అన్నది: ''నా భర్త తానొక ట్రాఫిక్ లైట్ అనుకుంటాడు. రాత్రి కూడా ఒక కన్ను తెరిచి ఉంచి, దాన్ని మూసి రెండోది తెరుస్తూ ఉంటాడు. అదుగో ఆ మూల కూర్చొని ఒక కన్ను తెరిచి ఉంచాడు—చూడండి.''

''నేను వెళ్ళి ఆయనతో మాట్లాడుతాను.'' అన్నాడు మనస్తత్వ వేత్త.

''ఇప్పుడా? ఇప్పుడొద్దు. ట్రాఫిక్ లైట్ డేంజర్ సిగ్నల్ చూపుతోంది—మీకు కనిపించటం లేదా?'' అన్నది ఆ యిల్లాలు.

---

మనం వాళ్ళ చెప్పు చేతల్లో ఎందుకు వుండాలన్న అహంకారం, అతిశయం ఎక్కువయి పోయాయి, ఈనాటి ఆడవారికి.'' ఆవేశంగా అన్నాడు రావు.

ఆడదానికి స్వయం సంపాదన వుండటము ఎంత అనర్థమో యిప్పుడు నాకు బాగా అర్థం అయింది—'' మళ్ళీ అన్నాడు.


''జనరలైజ్ చేయడం మంచిది కాదేమో!''

''పోనీ, ఎవరి సంగతో నాకనవసరం. కాని, యింట్లో చూస్తున్నాముగా! అందులో ఈ ఏడాదిగా మరీను! మూర్తీ, నీకు తెలియదు. రేఖ యిదివరకటి రేఖ కాదు. మారిపోయింది. ఆవిడకిప్పుడు నా మీద వెనకటి గౌరవం, ప్రేమ అవి వున్నాయని నేననుకోను. చాలా రోజులుగా కనిపెట్టి యీ నిర్ణయానికి వచ్చాను. మొగుడంటే అంత లక్ష్యం లేని భార్యతో కాపురం నాకు అక్కరలేదు.'' గబగబ గుక్క తిప్పుకోకుండా అన్నాడు.

''రావ్, చాలా తొందర పడ్తున్నావు. భార్యాభర్తల సంబంధం నీవనుకున్నంత తేలిగ్గా తెగిపోదు. కనీసం మన దేశంలో. రావ్ భార్యాభర్తలన్నాక మాట-మాట అనుకోవడం, అంతలోనే మరిచి సర్దుకుపోవడం ప్రతి యింట్లోనూ జరిగేదే! దానికే నీవు డైవోర్సు అంటూ అంత దూరం ఎందుకు వెడ్తున్నావో అర్థం కావడం లేదు. ఆవేశపడకు రావ్! రెండు రోజులు కాస్త శాంతంగా ఆలోచించు. నీవెంత తొందర పడ్తున్నావో నీకే అర్థం అవుతుంది!'' నచ్చచెప్తూ సర్ది చెప్పసాగాను. నా ఉద్దేశంలో రావు ఏదో మామూలు చిన్న-చిన్న తగువులను పెద్దవి చేసి ఆలోచించి మనసు పాడు చేసుకున్నాడనిపించింది. రావు ఎంత సెన్సిటివో నాకు తెలుసు, తన మాట నిర్లక్ష్యం చేసిందని కింద పడి, బాధ పడి, తొందర పడి యిలాంటి నిర్ణయానికి వచ్చాడని నాకు బాగా నమ్మకం.

కాని, రావు నా మాట వినిపించుకోలేదు. ఈ నిర్ణయం యిప్పటికిప్పుడు కోపంతో తొందరపడి చేసుకోలేదు లే! ఈ ఏడాదిగా ఎన్నో సార్లు చూసి, ఆలోచించి రేఖకి నేనవసరం లేదన్న నమ్మకం పూర్తిగా కలిగాకే యీ నిర్ణయం చేసుకున్నాను. నిన్నటంతా యిదే ఆలోచించాను.''

"కాని, నీవు బొత్తిగా మంచి-చెడూ విచక్షణ లేకుండా ఆలోచిస్తున్నావు రావ్! డైవోర్సు అంటే మనదేశంలో మాటలు గాదు! ఇదేం విదేశం కాదు. ఈ రోజు ఒకరికి డైవోర్సు. ఆ మర్నాడు మరొకరికి డైవోర్సు యిచ్చినా ఎవరూ పట్టించుకోక పోవడానికి! దీనివల్ల ఎంత అప్రదిష్ట నీకు. నీ వాళ్ళకి. రేఖకి. ఆమె కుటుంబానికి ఎంత అవహేళన పాలవుతారో తెలుసా మీరందరూ? నలుగురిలో పేరు, ప్రతిష్ట అన్నీ వున్న మీకు ఆ తర్వాత అందరూ ఏపాటి విలువ యిస్తారో తెలుసా"



రావు చిరాగ్గా కదిలాడు. 'మూర్తీ యిదంతా నాకు తెలుసు. ఇది ఇండియా కనకనే ఏడాదిఆలోచించాను. సంవత్సరం ఓపిక పట్టాను....ఎవరో ఏదో అనుకుంటారని, అంటారని ఒకళ్లకోసం అన్నీ వహించే ఓర్పు నాకులేదు. ఆ అవసరమూ లేదు...."మొండిగా అన్నాడు రావు.

ఇంకేం చెప్తాను. ఏలా చెప్పాలో అర్థం కాలేదు నాకు. వివాహబంధం అన్నది పవిత్రమైనదని. అది తెంపుకోవడం రావు అనుకున్నంత సులువుకాదని నా ఉద్దేశం. కాని అది అతనికి తెలియచెప్పి నచ్చచెప్పాలి! నా ఉద్దేశం అతనిమీద బలవంతాన రుద్దుదామన్నా అది రావు సహించడని నాకు బాగా తెలుసు....ఇంక రేఖ ఏమంటుంది? రేఖతో మాట్లాడితే కొన్ని సంగతులు తెలిసే అవకాశం వుంటుంది! ఇద్దరిలో తప్పెవరిదీ, ఎవరు తొందర పడ్డారో అన్నీ వివరంగా మాట్లాడి ఆమెకి నచ్చచెప్పి ఇద్దరికీ సంధి కుదర్చాలి! రావుకి నచ్చచెప్పడంకంటె రేఖని ఒప్పించడం సులువు! రావు ఏదో తొందరపడి మాట్లాడుతున్నా అతనంత తేలిగ్గా ఇలాంటి నిర్ణయాలను నేనామోదించలేను. రావు, రేఖ ఇద్దరూ నాకు కావల్సినవాళ్ళు! రావు ఆప్తమిత్రుడయితే. రేఖతో కాస్త కూస్తో బంధుత్వం కూడా వుంది! సంబంధం చూపించింది నేను! పెళ్ళి నా చేతుల మీదుగా జరిపించకపోయినా వాళ్ళ పెద్దల్లో ముఖ్యపాత్ర వహించాను. అలాంటిది నేనే రెండేళ్లన్నా కాకమునుపే వాళ్ళకి డైవోర్సు ఇప్పించడమా?....వీల్లేదు....

"ఏమిటి ఆలోచిస్తున్నావు? మూర్తీ నీవు రేఖదగ్గరికి వెళ్ళి ఆమెతో నాఉద్దేశం చెప్పి, ఆమె అభిప్రాయం కనుక్కుని... చేయాల్సిన ఏర్పాట్లు అన్నీ చెయ్యి....

నేను కోపంగా రావువంక చూశాను ...."సిల్లీగా మాట్లాడకు రావ్, నీ వివాహ డైవోర్సు కోరగానే రేపే దొరికిపోతుం దనుకుంటున్నావా ఏమిటి? చదువుకుని ఈ మాత్రంకూడా తెలియకుండా పూలిష్‌గా మాట్లాడకు....విడాకులు పొందడానికి భార్యాభర్తలిద్దరూ కనీసం కొన్ని సంవత్సరాలు విడిగా వున్నారన్న నిదర్శనం వుండాలి....అంచేత రేపొద్దునే నీకు ఆవిడకి డైవోర్సు ఇచ్చేయాలని వున్నా కుదరదు...."

రావు నా మొఖంలోకి చూశాడు.... "అయితే రేఖను వాళ్ళింటికి వెళ్ళమను...." అన్నాడు కాసేపుండి.

"అది చెప్పడానికి నే నెవరిని? అసలు ఆవిడ వర్షన్ ఏమిటో నేను వినాలి. ఆవిడ ఉద్దేశం ఏమిటో, తప్పు నీ దంటుందేమో ఆవిడ....ముందు అవన్నీ ఆమెతో నేను మాట్లాడాలి. తర్వాత డైవోర్స్ ఈయడం నీ కిష్టమైనా పుచ్చుకోడం ఆమెకి ఇష్టమో కాదో తెల్సుకోవాలి."

"ఇష్టం లేకపోతే మానేయమను.." నా దగ్గర మాత్రం వుండడానికి కుదరదు.. ఆవేశంగా లేచి అన్నాడు రావు". పుట్టింటి కెళ్ళి కొన్నాళ్ల వుంటే, అప్పటి కయినా మొగుడువిలువ ఏమిటో తెలిసివస్తుంది... మొగుడు వదిలేస్తాడంటే అందరు తనకి ఏపాటి విలువ. గౌరవం ఇస్తారో అప్పటి కయినా గ్రహించుకుంటుంది...,కోపంగా మాటలు వదలడం ఆరంభించాడు రావు.

"రావ్, నీవు అనవసరంగా ఆవేశ పడకు. నేను రేపు రేఖని కల్సుకుని అన్నీ మాట్లాడుతాను .... అసలు విషయం ఏమిటో."

"అంటే నా మాటమీద నీకు నమ్మకం లేదన్నమాట. నే నబద్ధం చెప్పానని నీ ఉద్దేశం అనుకుంటాను. వెళ్ళు వెళ్ళు ఆవిడ నిజం చెపుతుంది, ఆవిడ మాటలే విను. నే చెప్పిందంతా కాదంటుంది.తను

ఏంచెయ్యలే దంటుంది. ఇంతకీ నీతో చెప్పడం నాది బుద్ధితక్కువ. ఏదో ఫ్రెండువి గదా అని. అవునులే రేఖ నీకు బంధువుగా. ఆవిడనే సపోర్టు చేస్తావు,'' రావు టెంపర్ లూజ్ చేసుకుంటూ మొహం ఎర్రబరచుకుని, ఆవేశంగా ఏదేదో అనడం ఆరంభిచాడు. రావు మనసు సరిగాలేదని గ్రహించాను! ఇంక అలాంటప్పుడు ఏం మాట్లాడినా ప్రయోజనం వుండదు.

''నీ యిష్టం.... ఎలా అనుకున్నా అనుకో. రేఖతో మాట్లాడే వరకు నే నేం చెప్పలేను నీకు.'' అని చెప్పి రూములోంచి వచ్చేశాను.

* * *

మర్నాడు సాయంత్రం రేఖని కలవడానికి బయలుదేరాను. రేఖ కాలేజీనుంచి వచ్చివుండే టైము చూసుకుని.

తలుపు తట్టగానే తలుపుతీసి నన్ను చూసి కాస్త త్రొట్రుపడి కలవరపడింది రేఖ. ఆమె జుట్టు చిందరవందరగా...పడుకుని అప్పుడే లేచినట్లుంది కళ్ళు ఎర్రగా వున్నాయి. ముక్కు ఎర్రబడి ఆమె ఏడుస్తూందన్న సంగతిని దాపరికం లేకుండా చెప్పేస్తూంది. మొహం పీక్కుపోయి వుంది. నన్నుచూసి నవ్వడానికి ప్రయత్నించింది. కాస్త వెనక్కు ఓ అడుగు వేసి "ఆయన వూళ్లో లేరు, మొన్న వెళ్లారు. ఎప్పుడొస్తారో ఏమిటో తెలియదన్నారు,'' కాస్త తడబడుతూ. ఆ సమయంలో నా రాక ఆమెకి ఏమాత్రం యిష్టం లేదన్న సంగతి తెలుస్తున్నా మాట్లాడవలసింది వుందికనక.

''ఆయన లేకపోతే రానీయవేమిటి లోపలికి. పద నీతో పనుండి వచ్చాను. ఆయన కోసం రాలేదు.'' అన్నాను నవ్వుతూ.

రేఖ కాస్త సిగ్గుపడి, దారి తప్పుకుని దారి ఇచ్చి లోపలికి దారితీసింది.

''ఇవాళ ఉదయం నుంచీ ఒకటే తల నొప్పి- అలా పడుకున్నాను. దానికితోడు మధ్యాహ్నం నించి జ్వరం వచ్చినట్లు వళ్ళంతా నొప్పులు. వంట్లో సరిగా లేదు. అలా పడుకున్నాను. దానికితోడు ఆయన వూళ్లో లేరు. ఒక్కర్తినీ వుండటంతో చాలా చికాకుగా వుంది'' నే నెక్కడ ఆమె రూపురేఖలగురించి ఆరాలు తీస్తానేమోనని ముందే సంజాయిషీలు ఆరంభించింది. ఇంకా ఇంకా రేఖని అలా అబద్ధాలమీద అబద్ధాలాడనీయకుండా సూటిగా వచ్చిన పనిలోకి దిగడం మంచిదనిపించింది.

''కాలేజీకి వెళ్ళలేదా ఇవాళ?''

''ఊహూ. చెప్పాగా వంట్లో సరిగా లేదని.''

''వంట్లోనా, మనసులోనా?'' రేఖని గమనిస్తూ అడిగాను.

రేఖ మొహంలో రంగులు గబగబ మారాయి. కాస్త తెల్లబోయి చూసింది. 'మన సెందుకు బాగుండదు? అంత బాగుండక పోవడాని కేం వుంది' అంది తెచ్చుకున్న నవ్వుతో.

''నిన్న రావుని హోటల్ సాగర్‌లో కలిశాను.''

రేఖ బిత్తరపోయి చూసింది....గాభరాగా "అదేమిటి ఆయన ఊరికి వెడితే ....'' అంది.

''రేఖా. నీవు అనవసరంగా గాభరా పడకు. ఒక అబద్ధానికి మరో అబద్ధం ఆడాల్సివస్తుంది. అబద్ధాలు మొదలుపెడితే నాకు అంతా తెలుసు. నీ వలా స్థిమితంగా కూర్చో. నీతో మాట్లాడాలి.'' అన్నాను గంభీరంగా.

రేఖ సంభ్రమాశ్చర్యాలతో చూసింది. పెదాలు వణికాయి. ''కూర్చో రేఖా, నా దగ్గర నీకేం దాపరికంఅక్కరలేదు. రావు పిలిచి అంతా చెప్పాడు.''

''ఏం చెప్పారు?'' పాలిపోయిన మొఖంతో అడిగింది.

''తనెందుకు హోటల్లో వుండాల్సి వచ్చింది, అంటాను, రేఖా అసలేం జరిగింది?''

''అంటే'' మొగుడు కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు అన్న స్థితిలోవుంది రేఖ. నల్లబడిన మొహంతో నా వంక చూడడానికి కూడా యిబ్బంది పడసాగింది. నా పరిస్థితీ అలాగే ఉంది. రేఖతో అసలు ఏమి మాట్లాడాలో, ఏమని అడగాలో తెలియనిస్థితిలో పడ్డాను. భార్య భర్తల మధ్య జరిగిన విషయాలు చెప్పమని అడగడం-ఎంత వకీలు హోదాలో వచ్చినా - చాలా ఆక్వర్డుగా అనిపించింది! మమ్మల్ని ఇద్దర్నీ ఇలాంటి పరిస్థితిలో పడేసిన రావుమీద చాలా కోపం వచ్చింది.

''అంటే....అంటే మీ యిద్దరి మధ్య ఏం జరిగింది? రావుకి అంతకోపం ఎందుకు వచ్చింది? ఇల్లు, పెళ్ళాన్ని వదలి హోటల్లో వుండేంత దూరం ఎందుకు వెళ్ళాడు?''

---

✻ ఒక కోటీశ్వరుణ్ణి ఒక పత్రికా విలేఖరి ఇంటర్వ్యూ చేస్తూ ''తమ యీ విజయానికి ముఖ్య కారణం ఏమిటి?'' అని అడిగాడు.

''శక్తివంచన లేకుండా, హృదయపూర్వకంగా పని చేయటం—ఆ పనికి తగిన జీతం, ప్రతిఫలం ఉన్నదా లేదా అనే ప్రశ్న లేదు,'' అన్నాడు కోటీశ్వరుడు.

''నిజంగా మీరు యీ విషయాన్ని నమ్మి అనుసరించారా?'' అని అడిగాడు విలేఖరి.

''ఊహుఁ....ఇతరుల చేత నమ్మించి పని చేయించాను!'' అన్నాడు కోటీశ్వరుడు.

---

రేఖ కోపంగా, తీక్షణంగా చూసింది. "ఆ సంగతిని మీ ఫ్రెండునే అడగక పోయారూ, కట్టుకొన్న భార్య, ఆడదాన్ని ఒక రాత్రి వున్నపాటున వదలి రాత్రికి రాత్రి హోటల్‌కి వెళ్లాలిన అవసరం ఏమివచ్చిందో మీరే అడగలేపోయింది పరువు మర్యాద, నలుగురు ఏమనుకుంటారో నన్న ఇంగితం కూడా లేకుండా భార్యకి యింత అవమానం చేయడం,....చదువు సంస్కారం వున్న మనిషి ప్రవర్తించే తీరు ఇదేనేమో! వెళ్ళి ఆయన్నే అడగండి" రోషంతో ఆవేశంగా అంది రేఖ. అప్పటికే రేఖ కళ్ళలో నీరు తిరగడం ఆరంభమయింది.



"రేఖా, నీకు నీవు. అతనికి అతను. అసలు సంగతి చెప్పకుండా యిలా ఆవేశపడితే ఏం ప్రయోజనం? ఏం జరిగిందో చెపితే నీ తప్పో....

మధ్యలో రేఖ కస్సుమంది. "మీరూ వాదే తప్పంటారు. అవును. మీరూ మగవాళ్ళేకాదూ. ఆయనపక్షం మాట్లాడక నావైపు మాట్లాడుతారా! అవును ఆడదాన్ని, నేనేం చేసినా, ఏం చెయ్యకపోయినా తప్పులన్నీ నావి. ఆయన మగమహారాజు ఏం అన్నా, ఏం చేసినా చెల్లుతుంది, రుద్ధ కంఠంతో అంది.

ప్లీజ్ రేఖా, ఎందుకలా ఆవేశపడ్తావు. నీ తప్పో, ఆయన తప్పో అసలు మీ భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో, రావు డైవోర్సు వరకూ వెళ్ళేటంత ప్రపరిస్థితికి "రేఖ మొఖంచూసి, తొందరలో... చాలా తొందరగా చెప్పవలసిన దానికంటె ముందుగా 'డైవోర్స్' మాట చెప్పినందుకు కాస్త గాభరా పడ్తూ ఆవంక చూశాను. రేఖమొఖం తెల్లగా పాలిపోయింది. నా వంక విస్ఫారిత నేత్రాలతో చూసింది,

"సారీ. ఏదో చెప్పబోయాను, ఈ లోపలే రేఖ ఆశ్చర్యంనించి తేరుకుంది. ఆమె మొహం ఎర్రబడి పోయింది. పెదాలు వణికాయి. కళ్ళలో ఎర్రజీర తొంగిచూసింది.

"డైవోర్సు యిస్తారా నాకు....మంచిదే యీయమనండి. ఈయన గారు విడాకులు యిస్తానని నన్ను బెదిరిస్తున్నట్లున్నారు.... ఆయనగారు బెదిరించగానే భయపడిపోయి, ఆయన కాళ్ళు పట్టేసుకుని నీవే గతి నాధా అని ప్రార్థించి, ఏడుస్తానను కుంటున్నట్లు న్నారు.... అంతే, నేను ఆయనకి అక్కర లేనప్పుడు, నాకూ ఆయన మీద అంతే వుంటుందని తెలుసుకోమనండి!! పరువు, మర్యాద, కాపురం యివేవి ఆయనకి అవసరం లేకపోతే, నేనంటే లెక్కలేకపోతే ఆయన వెంటపడి దేవిరించడానికి నాకూ అవసరం లేదు ఆ మాత్రం అభిమానం, పౌరుషం నాకూ వున్నాయి. ఈయనగారు వదిలేసినంత మాత్రాన చచ్చిపోను. నా బ్రతుకు నేను బ్రతకగలనన్న సంగతి మీ ఫ్రెండుని తెల్సుకోమనండి. నన్ను బెదిరించాలని మాత్రం చూడొద్దనండి.."

ఆమె కళ్ళల్లో కోపం, మాటల్లో పౌరుషం, రోషమూ అవన్నీ చూస్తే రావు అన్నట్టు పొగరుబదుపుంది. ఉద్యోగం వుందిఅన్న ధీమాలే అది అనిపించింది. ఇద్దరికీ ఒక్కరికీ కాపురం ఎలాగైనా నిల్పుకోవాలన్న ఆరాటం, పరువు, ప్రతిష్ఠలు ఏమౌతాయన్న ఆలోచన కనపడడం లేదు.... అంతలా ప్రేమించి కావాలని పెళ్ళి చేసుకుని యిద్దరూ యిలా తయారయ్యేరేమిటా అన్న అనుమానం నన్ను వేధిస్తూంది నా మొహంలో ఆశ్చర్యం గమనించినట్లు—



"ఆయన కట్టుకోమన్న చీర కట్టుకోకుండా మరొకటి నా యిష్టం వచ్చింది కట్టుకోడం ఒక తప్పు. ఇంగ్లీషు సినిమా వద్దు హిందీకి వెడదాం అనడం మరో నేరం, ఆయనకి కాకరకాయ కూర యిష్టమవకపోతే అది నాకు యిష్టం అనడం అదో అపరాధం, సుబ్రమణ్యం యింటికి కాదు, బెనర్జీ యింటి కెడదాం అనడం క్షమించరాని నేరం, పనిమనిషి వచ్చింది కాస్త తలుపు తెరుద్దురూ అనడం భర్తని అవమానం చెయ్యడం, పాలు స్టౌ మీద పెట్టి మరిచిపోతే అవి పొంగి మాడి తగలడితే అవి కాపురం అంటే నిర్లక్ష్యం క్రింద లెక్క, ఆయన ఉతకమన్న టెర్లిన్ షర్టు వుతకడం మరిచిపోతే భర్తంటే గౌరవం లేకపోవడం, నిర్లక్ష్యం-పిల్లల్ని యిప్పటినించి వద్దు మరో ఏడాది పోయాక కందాం అంటే అది ఆయనంటే ప్రేమ లేకపోవడం క్రింద జమ, సినిమాకి వెడదామన్న రోజున కాలేజీలో ఏదో పనుండి ఆలశ్యంగా రావడం ఆయన మాట మీద నిర్లక్ష్యం వల్ల....

రేఖ ఆవేశంగా ఒక్కొక్క వాక్యం నొక్కి-నొక్కి పలుకుతూ కోపం వెళ్ళగ్రక్క సాగింది.

"ఏమిటి, యింత చిన్న విషయాలకా రావుకి అంత కోపం, అంత ఆవేశం!"

"లేకపోతే మరేమిటనుకున్నారు?....ఆయనకి ఆయన మాట అక్షరాలా తు-చ తప్పకుండా జరగాలి. అలా జరగకపోతే అదంతా నేను చదువుకున్న దాన్నవడం. ఉద్యోగస్థురాలినవడంవల్ల వచ్చిన అహంకారం. గర్వం అనుకోవడం, నేనేదో ఆయన్ని నిర్లక్ష్యం చేసేస్తున్నట్లు బాధ పడిపోవడం, ఆయనగారిని గడ్డిపోచ క్రింద లెక్కచేస్తున్నానని అపోహలు పెంచుకుంటూ, నాకు పెళ్ళానికి వుండాల్సిన వినయం, విధేయతలు, మొగుడంటే గౌరవం, భక్తి ఏం లేదన్న అనుమానం...."

"రావ్, ఇంత సంకుచితంగా ప్రవర్తిస్తాడంటే నేను నమ్మలేకుండా వున్నాను."

"నమ్మలేరు! అవును-పైవాళ్ళకి ఏం తెలుస్తుంది? మంచి చదువు, పరువు-ప్రతిష్ఠగల కుటుంబంలోంచి వచ్చిన ఓ మనిషి భార్య దగ్గిర యిలా ప్రవర్తిస్తాడంటే ఎవరూ నమ్మలేరు...."

"పోనీ, రావ్ టూ సెన్సిటివ్ అని నీకూ తెల్సు గదా, కాస్త నీవు సర్దుకుంటే పోయేది...." మాట యింకా పూర్తి కాకుండానే గయ్‌మంది రేఖ.

"సర్దుకోడం....ఎన్నాళ్లు? ఎన్ని విషయాలలో? నేనూ కాస్తో కూస్తో చదువుకున్నాను, నాకూ ఓ వ్యక్తిత్వం వుంది? ప్రతి చిన్న విషయానికి అపార్థాలు తీస్తూ, చిన్న పిల్లని బెదిరించినట్లు బెదిరిస్తూ, మొగుడి అధికారం ప్రతి స్వంత విషయంలోనూ చూపిస్తూంటే అన్నీ సహించి "పతిదేవా! నీవేం చేసినా పరవాలేదు. నా ధర్మం అనేటంత పతివ్రతని కాదు నేను. ఏ బి. సి. నాటి స్త్రీలో అలా వున్నారని ఈనాడు అలా పడివుండమంటే ఎవరూ వుండరు. భార్య కీయాల్సిన గౌరవం, ఆమె స్థానం ఆమెకిచ్చి గౌరవిస్తేనే ఆ ఆడదానికీ మొగుడంటే భక్తి, గౌరవం వుంటుంది...." ఆవేశంగా అంది రేఖ.

"రేఖా! మీ యిద్దరి మాటలు వింటుంటే రెండు చేతులూ కలుస్తేనే చప్పట్లవుతాయి అన్న సంగతి గుర్తు వస్తూంది. నీవూ కాస్తో కూస్తో సర్దుకోడానికి ప్రయత్నించినట్టు కనపడదు....అతని సంగతి తెల్సి నీవు కాస్త సహనం...."

"ఏం, ఎందుకు చూపాలి సహనం? నేనేం తప్పులు చేశానని ఆయన ఏమన్నా పడాలని? నాకేం పౌరుషం, అభిమానం లేవా? నేనూ మనిషినే....నాకూ కోపం-తాపం అన్నీ వున్నాయి. అయినా సహనానికి ఓ హద్దు వుంటుంది. పెళ్ళాం ఒక్కతె వుంది గదా అని ప్రతి దానికి సాధించి, ఇల్లు నరకం చేస్తూంటే ఏ పెళ్ళాం మాత్రం ఎన్నాళ్లు సహిస్తుంది?" కోపంగా అంది.

"అసలు రావు ఎందుకిలా తయారయ్యాడంటావు....?"

"చూడండి, ఆయనకి బాగా మనసులో చదువుకున్న ఆడవాళ్ళంటే ప్రిజుడిస్ ఏర్పడింది. చదువుకుని, ఉద్యోగం చేస్తున్నాను కనక మొగుడంటే లెక్క వుండాల్సిన అవసరం లేదన్నట్టు-నేను ప్రవర్తిస్తున్నట్టు ఆయనకి అనుమానం? ఇదే నేను అట్టే చదువుకోకుండా, ఉద్యోగం అది లేనిదాన్నయితే నా మాటలలో, చేతలలో యిన్ని అర్థాలు ఆయనకి స్ఫురించి ఉండవు? ఆయనకిప్పుడు నా ప్రతీ చర్య, ప్రతీ మాట విపరీతంగానే కన్పిస్తూంది. పచ్చకామెర్ల కళ్ళకి ప్రపంచం పచ్చగా కనిపించినట్టు, ఆయన కళ్ళకి నామామూలు చర్యలు కూడా అలా కన్పించడంలో వింత లేదు...."

"అలాంటి ప్రిజుడిస్ ఏర్పడడానికి ఏదన్నా కారణం వుండాలిగా!" తెలివిగా ప్రశ్నించాననుకొని జవాబు చెప్పమంటూ చూశాను.

రేఖ ఒక్క క్షణం నిశితంగా నా మొహం కేసి చూసింది. ఏమాత్రం తొణక్కుండా 'చెప్పమంటారా? మీ మగవాళ్లు ఆడదానికి ఆర్థిక స్వాతంత్ర్యం వుంటే భరించలేరు, ఆడదానికి సంపాదన వుంటే తమకి లొంగదని, తమతో సమాన స్థాయిలో వుంటే తమకి అణిగి మణిగి వుండదని భయం! ఆర్థికంగా తమపై ఆధారపడని స్త్రీకి మొగుడంటే నిర్లక్ష్యం వుంటుందని. అలాంటి స్త్రీని కంట్రోల్ చేసి చెప్పుచేతల్లో వుంచుకోలేం అన్న అపోహ వుంది! కనుక ఎప్పుడూ ఓ మెట్టు క్రింద వుండి, అన్నింటికీ తమ మీద ఆధారపడిన స్త్రీ కావాలి! ఆ పెళ్లాన్ని ఏదో ఉద్ధరిస్తున్నామన్న తృప్తి వాళ్ళకి కావాలి!" తీవ్రంగా అంది రేఖ.

"బాగుంది. నీతో నేనే కీభవించలేను. అందరూ అంతేనని జనరలైజ్ చేసేయడం...."

"జనరలైజ్ నేను చేయనక్కరలేదు, మీ మనసులని మీరే ప్రశ్నించుకోండి!"

"అయితే, యీనాడు యింతమంది ఆడవాళ్ళు ఉద్యోగాలు ఎలా చేస్తున్నారు? ఎలా చేయనిస్తున్నారు మగవాళ్ళు?"

"ఏం చేస్తారు? రోజులలా వున్నాయి ఆర్థికంగా వెనకబడి వుండి, భార్య సంపాదన అవసరం అవుతూంది. సంపాదన వ్యామోహం వదులుకోలేరు. తీరా పెళ్లాం సంపాయించడం మొదలు పెట్టాక భార్య చెప్పుచేతల్లోంచి జారిపోతూంది అన్న బాధ ఓవైపు....డబ్బు మీద వ్యామోహం వదులుకోలేని బలహీనత ఓ ప్రక్క.... ఇలాంటి మానసిక సంఘర్షణ మధ్య నలిగి, ఆ అక్కసు, కోపం అంతా తేరగా దొరికిందని భార్య మీద అర్థం పర్థం లేని కారణాలతో సాధించడం, తమ మనసు పాడుచేసుకోడం, కట్టుకున్న భార్యని కాల్చుకు తినడం—యిలా చేస్తున్నారు. ఇదంతా నేనూహించి చెప్పడం లేదు, స్వానుభవంతో పాటు స్వయంగా యితరుల నోట విని తెలుసుకున్నవి—అంచేత...."

"అయితే రావ్‌కి ముందు తెలియదా, నీవు వుద్యోగం చేస్తున్న దానివని?"

"అదే నా బాధ; ముందాయనకి నేను చదువుకున్న దాన్నని, ఉద్యోగం చేస్తున్న దాన్నని తెలియదా? కావాలని చేసుకుని యిప్పుడీ గొడవ ఏమిటి? అట్టే చదువుకోని దాన్ని చేసుకోవలసింది. ఆయన ఏమన్నా భరించి పడుండేది....అబ్బే, మళ్ళీ చదువుకున్న పెళ్ళాం అన్న గొప్ప కావాలి. ఈనాటి మగవాళ్ళ స్థితి ఎలా వుందంటే...."

"సరే, నీ అభిప్రాయం చెప్పావు. రావు మాటలు చెప్పాను. ఇప్పుడు యింక రావుకి నేనేం చెప్పాలి? చెప్పు...."

రేఖ మొహం మళ్ళీ ఎర్రబడింది.... 'ఏం చెప్పడం ఏమిటి?'


"రేఖా! ఏదో జరిగింది- జరిగింది. ఈ మాత్రం జగడాలు. మాట మాట అనుకోడాలు ప్రతి యింట్లోనూ వుంటాయి. ఈ మాత్రం దానికి కాపరాల వదులుకోరు ఎవరూ. నేను వెళ్ళి రావుకి నచ్చచెప్పి యింటికి పంపుతాను. నువ్వూ కాస్త శాంతంగా పొరపాటు జరిగిందన్నట్టు నచ్చచెప్పు.... ఆ మాత్రంతో రావు చల్లపడతాడు. అతనిది తాటాకులమంట లాంటి కోపం. నీవు క్షమాపణ...."

రేఖ తీక్షణంగా చూసింది. "నేనెందుకు క్షమాపణ చెప్పాలి? నేనేం అపరాధం చేశాను? ఆ మాటకొస్తే ఆయన నాకు చెప్పాలి.... ఉన్న పాటున, నన్నొక్క_త్తివి యింట్లో వదిలి, చెప్పా చెయ్యకుండా వదిలి వెళ్ళిపోయిన పెద్దమనిషిది తప్పు_నాది కాదు" అంది తీవ్రంగా.

"అబ్బ.... రేఖా! ఏదో అయింది. ఎంతయినా అతను నీ భర్త! ఆ మాత్రం అనకూడదు.... నీవు పడచ్చు....ఎవరో ఒకరు వర్దుకోకపోతే ఎలా చెప్పు?"

"వర్దుకోడం ఎందుకు? డైవోర్సు ఇస్తానన్నారుగా.... ఈయమనండి - నేనేం భయపడేదాన్ని కాదు." బింకంగా, ఉక్రోషంగా అంది రేఖ.

"రేఖా!" కాస్త కోపంగా పిలిచాను. "పిచ్చి నీవు. అతనికి అతను ఏదో డైవోర్సు-డైవోర్సు అంటూ ఇలా సులభంగా మాటాడుతున్నారు. సరే, అతను మగవాడు.... అతనికి బాధ లేదు. కాని నీ సంగతి నీవేమన్నా ఆలోచించావా?.... స్త్రీ స్వాతంత్ర్యం. సమాన హక్కులు అవి ఎన్ని కబుర్లు చెప్పినా మన దేశంలో ఆడదాని స్థానం పెద్దగా మారలేదని నా నమ్మకం. చదువుకున్న, ఉద్యోగం చేస్తున్న పురుషుల లాగ యధేచ్ఛగా, స్వేచ్ఛగా బ్రతికే సావకాశాలు మన దేశంలో స్త్రీకి యింకా రాలేదు విదేశాల స్త్రీల మాదిరి వంటరిగా ఆడది, ఏదో విధంగా మగవాడి అండ లేకుండా బ్రతకగలరు అన్నది మనదేశంలో జరగడం నీవనుకున్నంత సులువు కాదు_అది నీకూ తెల్సు. పోనీ మీ యిద్దరికి మీ మీ కుటుంబాల పరువు-ప్రతిష్ఠలెలా పోయినా అక్కర్లేదు. కాని, రేపొద్దున నీ సంగతి ఏమౌతుందో తెలుసు కోగలుగుతున్నావా. మొగుడొదిలిన ఆడదాన్ని ఏ తల్లిదండ్రీ కూడా ఆదరించరు మనదేశంలో.... మరో పెళ్ళి చేసుకుని హాయిగా వుండడానికి యిదేం విదేశం కాదు. పెళ్ళయి, కాపురం చేసిన ఆడదాన్ని రెండో పెళ్ళి ఆడదాన్ని పెళ్లాడడానికి మనదేశంలో ఏ మగాడు ముందుకు రాడన్న సంగతి నీకూ తెల్సు!.... జీవితాంతం వంటరిగా వుండగలనని బింకంగా చెప్పే నీ కబుర్లు యదార్థంలో ఎన్నాళ్లో నిలవలేవు ...."



"మహారాజులా వుండగలం. మీరనుకున్నంత అబలలు కాదు యీనాటి ఆడవాళ్ళు.... తప్పు నాది కాకపోయినా ఆయన కాళ్ళ మీద పడి క్షమాపణలు చెప్పమనడానికి."

"రేఖా, ఇది నీ మంచికోసం చెప్పే మాట. భార్యాభర్తల మధ్య ఎవరు తగ్గరు, ఎవరు ఓడారన్నది కాదు ప్రధానం. కాపురం నిలపడం. నీవు కాస్త నెగ్గాతే ఇందులో నీ కొచ్చే మాన్యత ఏంలేదు. నే నెందుకు చెప్తున్నానో అర్థం చేసుకో."

రేఖ జవాబీయలేదు. మొహం గంటు పెట్టుకు కూర్చుంది.

"ఏం, ఒప్పుకున్నట్టేనా? రావుతో చెప్పనా!" ఆశగా అన్నాను. రేఖ ఆవేశంగా తల విదిల్చింది. "మీకు తెలియదు. ఇవాళ నేను క్షమాపణ చెప్పితే ఏదో నిజంగా నావల్ల తప్పులు జరిగినట్లు ఆయన దయార్ద్రహృదయంతో, ఔదార్యం ప్రకటించినట్లు గర్వపడతారు. ముందు ముందు ఇది నా జీవితం మరింత కలతలకి కారణం అవుతుంది. అంతలో అన్నీ చంపుకొని పడివుండడం నా వల్ల కాదు. అంత దిగజారలేదు." పౌరుషంగా అంది రేఖ.

"ముందు ఆయన్ని తొందరపడినట్టు ఒప్పుకోమనండి. ఆ తర్వాత నేను తప్ప

కుండా నేనూ ఆవేశపడ్డాను. క్షమించమని కోరతాను." అంది మళ్ళీ తనే.

భార్యా భర్తలలో ఇద్దరూ ఎవరూ తామువున్న మెట్టుదిగడానికి ఇష్టపడటం లేదు. ఈ సమస్య తెగేది ఎలా?

"అయితే రావు అలా అనకపోతే నీవు డైవోర్సుకి సిద్ధపడతావా? యిదే నీ ఆఖరి నిర్ణయమా? బాగా ఆలోచించే మాట్లాడుతున్నావా? కఠినంగా అడిగాను. రేఖ మొహం నల్లబడింది. క్రింద పెదవి కొరుక్కుంటూ కూర్చుంది.

"రేఖా. నీకు చదువు ఉద్యోగం వుండడంవల్ల జరుగుతున్న అనర్థం ఇది. అని నన్నూ రావుతోపాటు అనుకోమన్నావా? చదువువల్ల జరిగే ఉపకారం యిదే అయితే యీ సంఘటనతో బుద్ధి తెచ్చుకుని నా ఆడపిల్లలకి పెద్ద చదువులు చెప్పించను. నీవల్ల ఆడపిల్లల తండ్రులందరూ యీ పాఠం నేర్చుకుని తమ ఆడ పిల్లలని చదువు సంధ్యలనుంచి దూరంచేసి మళ్లీ ఎనిమిదేళ్ళ వెనక్కి నడవడం జరిగితే అది నీలాంటి ఆడవారి ప్రవర్తనవల్లేనని తెలుసుకో. చదువు నీకిచ్చిన జ్ఞానం యిదే అయితే, నే నింతకన్న యింకేం చెప్ప నవసరంలేదు. భారతస్త్రీ సంస్కృతి. పవిత్రత, ఆమె ఔన్నత్యం అన్నీ మట్టిలో కలిసిపోనీయకండి.

రేఖ కళ్ళనుండి గిర్రున నీళ్ళు తిరిగాయి. 'అనండనండి. తప్పు నాది కాకపోయినా నన్నే అనండి, యింతేకదూ ఆడదాని బ్రతుకు? తప్పు చేయకపోయినా మొగాడి ముందు తలొగ్గి బతకాల్సిందే కదూ' [అలా చేయడానికి ఇష్టపడకపోతే. నే నాడదాన్ని కాదని మీ ఉద్దేశం. భారతస్త్రీ ఔన్నత్యం, పవిత్రత అంటూ పెద్ద కబుర్లు చెప్పి మా కాళ్ళకి బంధాలు వేసి యింకా ఎన్నాళ్లు యిలా మమ్మల్ని అణిచి వుంచుతారు? అనండనండి నన్నే అనండి '' [ఉక్రోషంగా అంటూ ఏడవడం ఆరంభించింది.

'"రేఖా!" సముదాయించే ధోరణిలో అన్నాడు.

"యింక నాకేం చెప్పనక్కర్లేదు. ఆయన మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి.'' ఆవేశంగా అంటూ లేచింది. "యీ యిల్లు ఖాళీ చెయ్యమంటే చేసి నా యిష్టం వచ్చినచోటికి పోతాను. ఆ మాట ఏదో చెప్పమనండి.'' విసురుగా బెడ్ రూములోకి పోయి తలుపులు వేసుకుంది.

అప్పుడింక రేఖతో ఏం మాట్లాడినా ప్రయోజనముంటుం దనిపించలేదు. బెడ్ రూమ్ దగ్గర నిల్చుని "సరే! రేఖా నే వెడుతున్నాను. రావుతో చెప్తాను. అతనేమనేది మళ్లీ రేపు వచ్చిచెపుతాను. ఈ కేసు నీవు కాస్త ఆవేశం తగ్గించుకుని ఆలోచించమని నా సలహా. యింతకంటె ఏం చెప్పలేను.'' అంటూ బయటికి వచ్చేశాను.

* * *

రాత్రి జరిగిందంతా పద్మతోచెప్పాను పద్మ తెల్లబోయింది. అయ్యొయ్యో ఇది ఏమిటండీ; ఇంత గొడవ ఎప్పుడు జరిగింది? చెప్పనేలేదు చెప్పారు నాకేం, వాళ్ళిద్దరికి మతులు పోయాయేమిటి? కాస్త దానికి విడాకు లిచ్చుకుంటారా? నిజంగానే పిచ్చెక్కినట్టుందిఇద్దరికి.' పద్మ వాపోతూ ఇద్దరం చాలాసేపు ఆవిషయమే చర్చించుకుంటూ. ఇద్దరికీ ఎలా వంది కుదర్చాలా అని ఆలోచిస్తూ తర్జనభర్జనలు పడ్డాం. వాళ్ళిద్దరికీ పిల్లలులేని లోటు ఆ క్షణంలో కొట్టొచ్చినట్టు కనిపించింది. వుంటే కనీసం పిల్లలకోసమన్నా సర్దుకునివుండే వారుగదా అనిపించింది. సగం కాపురాలు ఏదోవిధంగా నిలుస్తున్నాయంటే పిల్లల వల్లేనంటే అతిశయోక్తి కాదేమో ననిపించింది. "వుండండి. ముందు రేపు రేఖ దగ్గరకెళ్ళి నాలుగు దులిపి చివాట్లు పెట్టి మతివుందో పోయిందో అడుగుతాను. కేకవేసి బుద్ధిచెపుతాను.'' అంది కోపంగా పద్మ.

"ఆ పని చేద్దూ. ఎలాగైనా ఆడవాళ్లు ఆడవాళ్ళు మాట్లాడుకుంటే యింకాస్త మాటలాడుకోవచ్చు. నీవయితే యింకేమైనా చెప్పొచ్చు రేఖ. రేపువెళ్ళి ఎలాగైనా నచ్చచెప్పి. వీలయితే రావునిపిలిచి ఇద్దరిని కలిపి చివాట్లు పెట్టి, ఇద్దరిని కలిపి ఆ పుణ్యం కట్టుకో. నా కంటె నీవయితేనే యీ కార్యం సాధించే ఛాన్సులు ఎక్కువ వున్నాయి రేపు తప్పకుండా వెళ్ళు'' అన్నాను.

* * *

మర్నాడు సాయంత్రం కన్సల్టింగ్ రూములో ఉండగా ఫోను మ్రోగింది. ఇల్లు వూరికి దూరంగా వుండడం. ఇంట్లో చోటు లేకపోవడంవల్ల ఊరి మధ్యలో ఓ ఆఫీసురూము ఏర్పరుచుకున్నాను. క్లయింట్లకోసం. సాధారణంగా అక్కడికి ఫోను వచ్చిందంటే పద్మే అయుంటుందని నాకు తెల్సు. ఇంటి కెవరన్నా వస్తే నా కోసం ఫోను చేస్తూంటుంది. "హలో'' అన్నాను. అవతలనుంచి పద్మగొంతు. "మీ రింకా అక్కడే ఉన్నారా? చూడండి రేఖకి వంట్లో బాగులేదు. ఇంటికి వచ్చేటపుడు రావు యింటికి వెళ్ళిరండి.... అర్జెంటు. మరిచిపోకండి.''

"ఏమిటి. ఏమయింది.'' ఏదో రాకూడని అనుమానాలు వచ్చి ఆరాటంగా అడిగాను.

✻ భార్యా విధేయుడైన స్నేహితుణ్ణి "భార్య అంటే అంత భయపడి ఛస్తావ్— నీవు మొగాడివా? మూషికానివా?'' అని అడిగాడొకడు.

"మొగాణ్ణే! మూషికాన్నే ఐతే నా భార్య నన్ను చూసి హడిలి పోతూండేది!'' అన్నాడా మిత్రుడు.

"వెడతారుగా, మీరే చూడం" అంది ఫోన్‌లోనే ముసిముసి నవ్వులు నవ్వి. సప్రైజ్‌లో పెడుతూ.

"అబ్బ, చెప్పు ఏం జరిగిం..."

"ఇందాక నే వెళ్ళినప్పు రేఖ మొహం తిరిగి తెలివితప్పి ...కపోయి కాస్త హడావిడి చేసింది. డాక్టరు రావడం పరీక్షలు జరిగాయి."

"అలే, ఎందుకలా అయింది ఇప్పుడు ఎలా ఉంది? ఒక్కర్తె ఉందా ఇంట్లో? నీ ఉండలేక పోయావా కాసేపు. అన్నట్టు రావ్‌కి ఫోన్ చెయ్యకపోయావా?" ఆత్రుతగా ప్రశ్నలు కురిపించాను.

"ఒక్కర్తే ఏం చేయలేదు లెండి, రావ్‌కి ఫోన్‌చేశాను. ఉండాల్సిన వాళ్ళు వున్నప్పుడు, ఇంక నే నెందుకు?" న...్వింది.

"అంటే, అంటే. రావ్ ఇంతకీ రేఖ ఏం అంటుంది."

"వచ్చేత్తు! వెళ్ళి చూస్తారుగా" అంటూ ఫోను పెట్టేసింది. ...లిపిగా నవ్వింది.

ఆ తూవ ఎంతకోపం వచ్చిందో వర్మమీద. వెంటనే రావింటికి బయలు దేరాను. నే వెళ్ళేసరికి రావింట్లో పని చేసే మనిషి గేటుదగ్గిరే ఎదురు...డింది. "అమ్మగారికి వంట్లో బాగులే...దటగా, వర్మమ్మగారు చెప్పారు. ఎలా ...ంది?" అంటూ దాన్నే ఆరాటంగా ప్రశ్నించాను: అది ముసిముసినవ్వులు న...్వింది.

"ఏటి, వేదు బాబూ!....పిన్న బాబు పుట్టారు....అవలే యికారం అవి అన్నం తినడం లేదు....రెండురోజులనుండి అన్నం వండుకో లేదు....మరి మొహం తిరగదా....ఆ అమ్మకంతా ఆయో...యం! కాముకోలేక పోయింది....డాక్టరవచ్చి చెప్పేవరకు—ఏటో అనుకున్నాన ...ుంది, వత్తెకాలం పిల్ల....ఏటి తెలీ...." అలా మాట్లాడుతున్న దాన్ని వది గది-

లోపలికి వెళ్ళాను. ఆ వార్త ఎందుకో నాకు చాలా ఆనందాన్ని యిచ్చింది.

బెడ్‌రూము దగ్గిరకి వెళ్ళేసరికి చటుక్కున నా కాళ్ళు నిలిచిపోయాయి. అత్యాశ్చర్యకరమైన దృశ్యం చూస్తున్నట్టు అలా నిలిచిపోయాను? ప్రక్కమీద రేఖ పడుకుని వుంది. రావు ఆమె మీద వ్రాసి. చేతులు చుట్టూ బిగించి ఆమె గుండెల్లో మొహం దాచుకున్నాడు. రేఖ చేతులు రావు మెడ చుట్టూ బిగిసి వున్నాయి....

అలికిడికి యిటు చూసి రావు లేచి కూర్చున్నాడు చటుక్కున వాళ్ళిద్దరి మొహాలు సిగ్గుతో కంది పోయాయి....ఆ సిగ్గు....నేను చూడకూడని దృశ్యం చూశానని కాదు... నా మొహంలో ఆశ్చర్యం చూసిపడిన సిగ్గని నాకు తెలుసు!.... వాళ్ళిద్దరూ తడబడి పోయారు....రావు ఏదో చెప్పబోయాడు. నేను చేత్తో వారించాను.

"సారీ! రాకూడని సమయంలో వచ్చాను... సరే ఎలాగో వచ్చాడు గనక ఈ కేసు యింత సులభంగా పరిష్కరించినందుకు మీరు, మీతోపాటు నేను 'మీ సోమలింగానికి' థెంక్స్ చెప్పుకోవాలి.... అన్నాను చిలిపిగా నవ్వుతూ. నా మాట అర్థం కాక తెల్లబోయి చూస్తున్న ఆ యిద్దరిని వదిలి, నవ్వుకుంటూ బయటికి వచ్చేశాను.






డా॥ పి. కుమారస్వామిదేవర

ట్రావెలర్స్ బంగళా రోడ్డు

తెనాలి — ఫోన్ : 551

బ్రాంచి

9-డి. శివాజీ వీధి. మద్రాసు-17

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్తప్రయోగం అంగము చిన్నదగుట. సంభోగ కాలమందు అకస్మాత్తుగా కృశించుట. శుక్ల నష్టము, నపుంసకత్వము (ఒక దోసుతో ఎన్నడు కని విని ఎరుగనంత వీర్యస్తంభనము కలిగి హాయి నిచ్చును - అసంతృప్తి చెందు స్త్రీ పురుషులు వాడతగినది స్వస్థులు) ఉబ్బసము (దమ్ము), కుష్ఠు, బొల్లి, చర్మవ్యాధులు, కడుపులో నొప్పి, చెవుడు మొద లగు వ్యాధులకు పోస్టు ద్వారా కూడ గ్యారంటీగా చికిత్స చేయబడును.